# బడ్జెట్ భాగోతం



**మో**పెడ్ అమ్మిన తరువాత కొద్దిరోజుల వరకూ శాయిరామ్ ఎవరికి కనిపించలేదు. కాలనీ మీటింగ్‌లు కూడా రెండువారాలపాటు నిర్వహించకుండా వదిలేశాడు. రెండు ఆదివారాల పాటు మమ్మల్ని సుఖంగా నిద్రపోనిచ్చినందుకు మేమెంతో ఆనందించాంగాని మా ఆనందం ఎక్కువకాలం నిలవలేదు. మూడో ఆదివారం కొంపముంచుకుపోయినట్లు అందరిళ్ళకూ వెళ్ళి మీటింగ్‌కు తరుముకొచ్చాడు.

"ఇప్పుడు మీటింగ్ దేనికిట!" కోపం అణుచుకుంటూ శాయిరామ్‌ని అడిగాను.

"ఎందుకేమిటి? వచ్చే శనివారమే బడ్జెట్ వస్తోంది."

"అయితే మనకేమిటి హడావిడి?"

దానికి శాయిరామ్ జవాబు చెప్పకుండా మిగతా వాళ్ళందర్నీ పిలిచి, నన్నో తెలివి తక్కువ వాడిలా చూపిస్తూ "చూశారా! ఎడ్యుకేటెడ్ అయియున్నా కూడా ఉదయార్కర్‌కు బడ్జెట్ విలువ తెలీదు. మన కాలనీలో ఈ ఒక్క ఉదయార్కరేకాదు. ఇంకెంతోమంది అజ్ఞానులున్నారు. అలాంటి వాళ్ళను నిద్రమేల్కొలవటానికే మనం ఇక్కడ సమావేశమయ్యాం!" అన్నాడు.

అందరూ నావేపు జాలిగా చూశారు.

"బడ్జెట్ విలువ తెలీదా?" అన్నట్లు నవ్వారు.

నేనిక లాభం లేదని సైలంటయిపోయాను. శాయీరామ్ మైక్ ముందు కొంచెం హడావుడి చేశాక రంగారెడ్డి ఉత్సాహంగా మైక్ అందుకున్నాడు.

"సోదరసోదరీమణులారా! ఇన్ని సంవత్సరాలుగా మనందరం ఎంతనష్టపోతున్నామో ఎలా నష్టపోతున్నామో మీకెవరికయినా తెలుసా? ఉదయార్కర్‌గారూ! మీకు తెలుసా!" అడిగాడు నన్ను.

"తెలీదు! అన్నాను మొఖవాటం లేకుండా

"గోపాల్రావ్ గారు, మీకు తెలుసా?"

"కొంచెం తెలుసుగానీ- మర్చిపోయాను" అన్నాడు గోపాల్రావ్ తప్పించుకుంటూ.

"జనార్ధన్ గారూ మీకు తెలుసా!"

"తెలీదు-"

రంగారెడ్డి విజయగర్వంగా అందరివేపూ చూశాడు.

"కానీ నాకు తెలుసు!" అన్నాడు చిరునవ్వుతో అందరం రంగారెడ్డి వంక ఈర్శ్యగా చూశాము.

మాకు తెలీనీ విషయాలన్నీ అతనికెలా తెలిశాయీ అని.

"తెలుస్తే చెప్పు త్వరగా!" అన్నాడు చంద్రకాంత్.

"నాకు తెల్సిందది కాదు! మీకెవరికి ఏమీ తెలీదన్న విషయం నాకు తెలుసు" చిరునవ్వుతో అన్నాడు రెడ్డి.

"సంగతేమిటంటే మనకాలనీ శ్యామల్రావ్‌గారు ఏం చేశారనుకున్నారు? కిందటి బడ్జెట్‌కి ముందురోజు ఓ గదినిండుగా సబ్బులు కొనుక్కొచ్చి ఇట్లో పెట్టుకున్నాడు. మర్నాడు బడ్జెట్ చూస్తే ఏం జరిగింది అనుకున్నారు? ఒకో సబ్బుమీద పావలా చొప్పున టాక్స్ పెరిగింది. అంటే శ్యామల్రావ్‌కి ఎంతలాభం కలిగిందో మీరే చూడండి! గడినిండా ఉన్న సబ్బులన్నీ కొంచెం చౌకధరకు మన కాలనీ వాళ్ళందరికీ అమ్మి వేల రూపాయలు సంపాదించాడు-" అందరం మొఖమొఖాలు చూసుకున్నాం.

శ్యామల్రావ్ సబ్బులమ్మితే కొన్నాంగానీ- దానివెనుక ఈ కథ ఉందని మాకు తెలీదు. తన అన్న కొడుకు సబ్బుల కంపెనీలో రిప్రజెంటేటివ్ అనీ, అందుచేత ఓ అయిదు పైసలు తక్కువకు దొరుకుతున్నాయనీ మా అందరికీ అబద్ధం చెప్పాడు. అది మేము శుంఠల్లా నమ్మేశాము.

"కనుక సోదరులారా! రేపు శనివారం వస్తున్న బడ్జెట్ కి ముందే మనం కూడా తెలివిగా కొన్ని వస్తువులు కొనేసి స్టాక్‌పెట్టినట్లయితే– మనందరికీ ఎంత లాభమో ఒక్కసారి ఆలోచించండి."

అందరూ ఒక్కసారి ఆలోచించేసరికి గుండెలు బాదుకోబుద్దేసింది. ఆడాళ్ళలో పెద్దఎత్తున కలవరం చెలరేగింది.

"ఈవిషయం మనకు తెలీనే తెలీదు పిన్నిగారు! చూశారా– మనకాలనీలో ఉండటం వల్ల మనకెన్ని విషయాలు తెలుస్తున్నాయో– నేనూ మా రెండు ఆల్మారాల నిండుగా బట్టల సబ్బులు కొనిపెట్టేస్తాను."

"నేను చింతపడుకొంటాను–"

"మీరేంకొటారు పార్వతమ్మగారూ."

"స్టీలు గిన్నెలు" అందామె.

తమలో తాము చర్చించుకోవటం పూర్తయ్యాక జనార్ధన్ మైక్ ముందుకొచ్చాడు.

"నా ప్రియమైన తెలుగు ప్రజలారా!" అన్నాడు సినిమా ఫక్కిలో! "మీకో విషయం చెప్పడం మర్చిపోయాను" జనార్ధన్ ఇటీవల కొంచెం ఎన్టీఆర్‌ని అనుకరిస్తూ మాట్లాడడం. హావభావాలు ప్రదర్శించటం చేస్తూన్నాడు. అతనలా చేయడానికి కారణం ఏమిటంటే– ఎన్టీఆర్ ఎలాగూ సినిమా ఫీల్డు వదిలేశాడు కాబట్టి ఆస్థానం అలా ఖాళీగానే ఉంది కాబట్టి సినిమాల్లో ఎన్టీఆఆర్ వేసే హీరో పాత్రలు తనకు లభించే అవకాశం ఉంటుందని ఎవరోచెప్పారుట.

"ముక్కుపచ్చలారని చిన్నారి ముద్దుబిడ్డలారా? తెలుగింటి వెలుగులు నా ప్రియమయిన ఆడపడుచులారా!" ఆ మాటలతో ఆడాళ్ళందరూ తప్పట్లు కొట్టారు.

మాకు మతిపోయినట్లయింది. ఒకే ఒక్క డైలాగ్‌తో మా కాలనీ ఆడాళ్ళందరి అభిమానం సంపాదించాడే అని.

"నేను మన కాలనీ ప్రెసిడెంటు అయిన దగ్గర్నుంచీ అనుక్షణం, క్షణం క్షణం, ప్రతిక్షణం– మీకేం సేవ చేయగలనా అని ఆలోచనలు పున:రాలోచనలు చేస్తున్నాను. ఇన్నాల్టికి ఇప్పుడా అవకాశం లభించింది!"

మళ్ళీ ఆడాళ్ళందరూ తప్పట్లు కొట్టారు.

"ఈ బడ్జెట్‌లో పెరిగే ధరలు సాధారణంగా మనలాంటి మధ్యతరగతి ఫామిలీస్ అందరికీ శాపం! కానీ ఈ శాపాన్నివరంగా మార్చుకునేందుకు నేను సహాయం చేస్తాను. ఢిల్లీలో ఫైనాన్స్ మినిస్ట్రీ బడ్జెట్‌సెల్‌లో మా పిన్ని కొడుకు పనిచేస్తున్న విషయం మీకెవరికీ బహుశ తెలిసుండదు. నిన్నటివరకూ నాకూ తెలీదనుకోండి. అది వేరే విషయం. వాడితో

ఫోన్లో మాట్లాడాను. బడ్జెట్ ప్రెజెంట్ చేయడానికి ఓ రోజు ముందు, అంటే శుక్రవారం సాయంత్రం మనకు ఏమేం వస్తువుల ధరలు పెరగనున్నదీ రహస్యంగా ఫోన్‌లో ఇన్‌ఫర్మేషన్ అందిస్తానని ప్రామిస్ చేశాడు. మనకా ఇన్‌ఫర్మేషన్ అందగానే మనమంతా ఆ వస్తువులు మన ఆర్థిక శక్తికొద్దీ కొని స్టాక్ చేసిపారేస్తే– మనమూ వాడుకోవచ్చు– ఇంకాలాభానికీ బయట అమ్ముకోవచ్చుకూడా–"

అందరూ తప్పట్లు కొట్టారు. ఈసారి మగాళ్ళందరూ కూడా తప్పట్లు కొట్టడం నాకు ఆశ్చర్యం కలిగించింది. శుక్రవారం వరకూ కాలనీ వాళ్ళందరూ చాలా హడావుడిగా రోజులు గడిపారు. చాలామంది బ్యాంకుల్లో దాచుకున్న డబ్బంతా విత్‌డ్రాచేసి రడీగా పెట్టుకున్నారు. బ్యాంక్ బాలెన్స్ లేనివాళ్ళు నగలు బ్యాంకులో పెట్టి డబ్బు తీసుకున్నారు.

ఇంకొంతమంది బంధువుల నుండి అప్పులు తీసుకున్నారు.

శుక్రవారం సాయంత్రం వచ్చేసింది.

గోపాల్రావ్, శాయిరామ్, రంగారెడ్డి, యాదగిరీ, నేనూ, జనార్ధన్ కలసి మాకు తెలిసిన ఓ ఫోన్ ఓనర్ ఇంటికెళ్ళి కూర్చున్నాము.

సాయంత్రం ఏడుగంటల తరువాత ఢిల్లీనుంచీ ఫోన్ వచ్చింది జనార్ధన్ ఫోన్ అందుకున్నాడు. ఓ చేతిలోపెన్నూ మరోచేతిలో అప్పుడే కొత్తగా కొన్న నోట్ పుస్తకం పట్టుకూర్చున్నాడు గోపాల్రావ్.

"రాసుకో" అన్నాడు జనార్ధన్ హడావుడిగా, "టూత్‌పేస్ట్‌లు" గోపాల్రావ్ చకచక రాసేశాడు.

"నెక్ట్స్–టేబుల్ ఫాన్లు– ఆ తరువాత సబ్బులు– వనస్పతి–" అయిదు నిమిషాల పాటులిస్ట్ చదివాడు.

అందరం ఆలోచనలో పడ్డాం.

అప్పటికప్పుడు లిస్ట్ కాపీలు తయారయాయ్.

"ఇంక ఆలస్యం ఎందుకు పదండి–" అన్నాడు శాయిరామ్. అందరం వెంటనే మార్కెట్‌కి పరుగెత్తాం. నేనుమాత్రం వీలయినంత టూత్‌పేస్ట్‌స్టాక్ మా ఇంట్లో నింపేయాలని నిర్ణయించుకున్నాను.

ఆ రాత్రి పదిగంటల వరకూ మా కాలనీలోకి రిక్షాల్లో రకరకాల వస్తువులు చేరుతూనే ఉన్నాయ్. మిగతా రాత్రి కూడా ఎవ్వరికీ నిద్ర పటినట్లులేదు. అందరిళ్ళల్లోనుంచీ చాలా ఎగ్జయిటింగ్‌గా మాటలు వినబడుతూనే ఉన్నాయ్. కనీసం యాభయ్ వేలయినా సంపాదించలేమంటారా పిన్నిగారూ?" లాంటివి.

తెల్లారిపోయింది. అందరం ఆఫీస్‌కి శెలవుపెట్టి మధ్యాహ్నం నుంచీ రేడియోదగ్గరే కూర్చున్నాం.

సాయంత్రమయేసరికి బడ్జెట్ వివరాలు ఒక్కటొక్కటే బయటకొస్తూంటే అందరి గుండెల్లోనూ ఆందోళన మొదలయింది.

జనార్ధన్‌కి ఫోన్‌లోవచ్చిన లిస్ట్‌లోని వస్తువుల ధరలేమాత్రం పెరగలేదు. అందరి మొఖాలూ పాలిపోయాయ్! కొంతమంది ఆడంగులు గట్టిగా ఎవర్నోతిట్టడం, శాపనార్ధాలు పెట్టటం స్పష్టంగా వినిపిస్తూనే ఉంది.

మా ఆవిడ దిగులుగా వచ్చింది టి.వి. దగ్గర్నుంచీ!

"ఇప్పుడా రెండువేల రూపాయల టూత్‌పేస్ట్‌లు ఏమిటి చేయటం!" అంది గాబరాగా.

అప్పుడే జనార్ధన్ భార్యవచ్చింది మా ఇంటికి.

"వాళ్ళ పిన్నికొడుకు మాటలు నమ్మవద్దని మొత్తుకుంటూనే ఉన్నాను. అక్కయ్యగారు! వింటేనా? ఇరవై టేబుల్ ఫాన్లు కొనుక్కొచ్చి ఇంట్లోపడేశారు. ఓగదంతా నిండిపోయాయవి. ఇల్లు ఇరుకయింది. ఇప్పుడా ఫాన్లు ఏంచేయాలి?" ఏడుపు ఆపుకుంటూ అందామె.

మరికాసేపటికి యాదగిరి వచ్చాడు.

"క్యా పరేషానీ హై యారో! జనార్ధనన్న భరోసామీదికెళ్ళి సబ్బులు కొనిపెట్టినా! నా భార్యేం చేసిందో ఇన్నావు? నీయవ్వ- నాకెరుక లేకుండా చింతపండు వందకిలోలు తెచ్చి స్టాక్ పెట్టింది! బడ్జెట్‌లో చింతపండు ధర ఏడయినా పెరుగుతాదివయ్యా?"

ఆ రాత్రికల్లా మరెన్నో ఆసక్తికరమైన వివరాలందాయ్. చాలామంది కాలనీ ఆడాళ్ళు కాలనీలో చెలరేగిన పుకార్లు నమ్మి గాజులు, పౌడర్లు, స్నోలు, బొట్టుబిళ్ళలు, కొంతమంది కూరగాయలు కూడా కొనేసి స్టాక్‌పెట్టారుట.

జనార్ధన్ ఎవరికీకనిపించలేదు. ఎంతోమంది అతనింటికి వెళ్ళినా ఇంట్లో కనిపించలేదుట! ఎక్కడికెళ్ళాడో ఎవరికీ తెలీదన్నారు. మిగతా రాత్రంతా కూడా ఇంట్లో స్టాక్ ఏం చేసుకోవాలో తెలీక దిగులుతో ఎవ్వరూ నిద్రపోలేదు.

మర్నాడు ఉదయం శాయిరామ్ పరుగుతోవచ్చాడు.

"చూశావా గురూ! ఉప్పు ధర తెగపెరిగిపోయింది! మనం అదయినా స్టాక్‌పెట్టి ఉంటే ఎంత బావుండేది?" అన్నాడు విచారంగా.

"ఉప్పు ధర పెరుగుతుందని ఎవరనుకున్నారు?" అన్నాన్నేను విరక్తిగా!

"మనం కొన్న స్టాక్ నంతా సాయంత్రం తీసుకెళ్ళి మళ్ళీషాపుల వాళ్ళకిస్తే తీసుకుంటారేమో!" అన్నాడు రంగారెడ్డి.

సాయంత్రం అందరం బయల్దేరి మార్కెట్ చేరుకున్నాం.

మా కథంతా వినిషాపువాడు నవ్వాడు.

"ఏ ఫర్లేదుసార్! స్టాకంతా తీసుకొచ్చేయండి! సగంధర ఇచ్చేస్తాను–" అన్నాడు. శాయీరామ్ అదిరిపోయాడు.

"సగం ధరకా?"

"అవున్సార్! ఎంతోకాలం నుంచి తెలిసినవారు కదా! అందుకని మీకు సగంధర ఇచ్చేస్తాను.

"అంటే మిగతావాళ్ళకు అదికూడా ఇవ్వవా?"

"మిగతావాళ్ళ దగ్గర అసలు కొననుగద్సార్?"

"కానీ మరీ సగంధర అంటే మాకు సగం నష్టం రాదూ?"

"బిజినెస్ అన్నాక అంతే సార్! ఒకోసారి ఇలాగే నష్టం వస్తూంటుంది!" జాలిగా అన్నాడు.

"కాని మాది... మాది........ బిజినెస్ కాదు కదా......."

"నష్టం వచ్చింది కాబట్టి ఇలా అంటున్నారు గురూజీ! ఇదే బడ్జెట్‌లో ఆ వస్తువు ధర ఒకోదానిమీద రూపాయి పెరిగిందనుకోండి! మీరు బిజినెస్ చేయరూ?"

అందరం ఇళ్ళకు తిరిగివచ్చాం!

అర్జంటుగా అప్పటికప్పుడే కాలనీ మీటింగ్ ఏర్పాటు చేశాడు శాయీరామ్. ఆడామొగా అందరం వాడిపోయిన మొఖాలతో కూర్చున్నాం.

"సోదరసోదరీమణులారా! అనుకోకుండా అందరం దెబ్బతిన్నాం! ఇప్పుడీ భయంకర పరిస్థితి నుంచి ఎలా బయటపడాలా అనే విషయం ఆలోచించాలి మనం–" అన్నాడు రంగారెడ్డి. "నష్టానికి అమ్మేద్దాం!" అన్నాడు గోపాల్రావ్. అందరూ "వద్దు" అనికేక వేశారు.

"ఆ జనార్ధన్ పనిపడతాను! మా ఇల్లంతా సర్వనాశనం చేశాడు–" అన్నాడు వెంకట్రావ్ కోపంగా.

"ఎందుకు? ఏం జరిగింది?" అడిగాడు శాయీరామ్.

"నేను రెండూ క్వింటాళ్ళు వంకాయలు కొన్నాను–"

మానిసార్‌గాడు జనంలోంచి మైక్ దగ్గరకొచ్చాడు.

"మీక్కావాలీ–తో–నేను ఒక్క అయిడియా చెప్తుయ్!" అన్నాడు చిరునవ్వుతో

"చెప్పరా నాయినా! త్వరగా అఘోరించు" అరచాడు రంగారెడ్డి.

"బార్టర్‌సిస్టమ్ మంచిగ ఉంటాయ్! బార్టర్ సిస్టమ్ బోలేతోమీకి సమజ్ అవుతున్నాయ్?

మాకు అర్ధమయింది. డబ్బు చలామణీలేనికాలంలో వాడేవాళ్ళది.

వస్తువు బదులు వస్తువు మార్చుకోవటం–

"ఒండర్‌ఫుల్ అయిడియా–" అన్నాడు యాదగిరి.

అందరం నిసార్‌ని కౌగిలించుకున్నాం!

"ఇంతమంచి అయిడియా నీకెట్లా వచ్చిందన్నా?" అడిగాడు యాదగిరి.

"నేను వెయ్యిరూపాయల్ బ్రెడ్‌స్టాక్ ఇంట్లోపెట్టినయ్! అదిచూస్తే అయిడియా వచ్చినయ్.

అప్పటికప్పుడే బార్టర్‌సిస్టమ్ అమలు పరచటం ప్రారంభమయింది.

నాదగ్గరున్న టూత్‌పేస్ట్‌లు కాలనీలో అందరికీ తలకొన్నీ అంటగట్టేశాను. మహా అయితే రెండొందలు నష్టం వచ్చి ఉంటుందంతే.

అలాగే శాయిరామ్ కాఫీ పొడి పాకెట్లు అందరికీ పంచాడు. నిసార్‌గాడి దగ్గరున్న బ్రెడ్‌స్టాక్ అందరం పంచుకున్నాం. వెంకట్రావ్ కొన్న వంకాయలు ఆ రాత్రే అందరూ చచ్చినట్లు, సయించకపోయినా వండుకుతిన్నారు. పనిలోపని అని యాదగిరి భార్య చింతపండు అందరకూ పంచేసింది. ఎటోచ్చీ గొడవంతా ఎక్కడొచ్చిదంటే డిటెక్టివ్ రచయిత్రి రాజేశ్వరి దగ్గర.

ఆమె న్యూస్‌ప్రింట్ ధర పెరుగుతుందన్న నమ్మకంతో బోలెడు న్యూస్‌ప్రింట్‌కొని పెట్టేసింది. అది ఎవ్వరూ పంచుకోవడానికి ఇష్టపడలేదు.

"అసలు ఆపాడు న్యూస్ ప్రింట్ ఎందుకు కొన్నట్లు?" చిరాగ్గా అడిగాడు రంగారెడ్డి.

"ధరలు పెరిగితే పబ్లిషర్లంతా న్యూస్‌ప్రింట్ కోసం 'క్యూ' కట్టి నేనడిగినరేటిచ్చి కొనుక్కెళ్ళతారని అనుకున్నాను...." అందామె కన్నీళ్ళతో.

"అయినా అంత ఆశ ఉండకూడదు మరీనూ?" అన్నాడు గోపాల్రావ్.

"నేను డబ్బుకోసం ఆశపడలేదు. న్యూస్‌ప్రింట్ మామూలు ధరకే ఇచ్చి, అందుకు ప్రతిఫలంగా నా డిటెక్టివ్ నవలలు పబ్లిష్ చేయమని కోరదామనుకున్నాను–" అందామె అసలు విషయం బయటపెడుతూ. చివరకు శాయిరామ్ ఓ అయిడియా ఇచ్చాడు.

"ఎలాగూ ప్రతి తెలుగు కుటుంబంలో ఓ కథారచయిత (త్రి) గానీ, గేయ రచయిత (త్రి) గానీ, నవలా రచయిత(త్రి) గానీ, కార్టునిస్ట్‌గాని ఉండక తప్పదు కదా. కనుక ఎవరి రచనలు వాళ్ళు రాజేశ్వరి న్యూస్‌ప్రింట్ కొనుక్కుని అచ్చువేసుకుంటే పదికాలాలపాటు వాళ్ళ రచనలు నిలిచిపోతాయ్

ఆ మాట చెప్పాడో లేదో రాజేశ్వరి న్యూస్‌ప్రింట్ అంతా ఖర్చయిపోయింది.

బార్టర్‌సిస్టమ్ అమలు చేయటం వల్ల కాలనీలో కొన్ని ఇబ్బందులు కూడా ఎదురయ్యాయ్.

ఆ పద్ధతి ద్వారా నేను కొనాల్సివచ్చిన– సిగరెట్లు, బీడీలు–అలవాటు లేకపోయినా తాగక తప్పటం లేదు.

అలాగే శాయిరామ్ అందరికీ తలోబాటిల్ విస్కీ ఇచ్చాడు. అది మగవాళ్ళకు బాగానే ఉండి. అయితే చాలామంది ఆడాళ్ళు దాన్ని వెంటనే పారబోసేశారని తెలిసింది.

జనార్ధన్ ఒక్కడికే చాలా ఎక్కువ నష్టం వచ్చింది కాలనీమొత్తంలో.

టేబుల్ ఫాన్లన్నీ అలాగే ఉండిపోయాయ్ ఎవ్వరూ తీసుకోలేదు.

మర్నాడు మా ఆవిడ కూరగాయలమ్మాయి దగ్గర తోటకూర కొంటూటే కట్ట ఒక్కటీ పావలా అనటం వినిపించింది నాకు.

"అదేమిటి?– నిన్నేగా పావలాకి నాలుగుకట్టలిచ్చావ్!" అడిగిందామె ఆశ్చర్యంగా.

"బడిజెట్టంటమ్మా– అదేందో నాకెరుకలేదుగానీ– ధరలు పెరిగినయ్యంట"

బడ్జెట్‌కీ తోటకూరకూ సంబంధం ఏమిటో నాకర్థంకాలేదు.

నేను ఇంకుబాటిల్ కొందామని మా కాలనీ దగ్గర్లోనే ఉన్న షాపు కెళ్ళాను.

"ఆర్రూపాయలు సార్." అన్నాడు షాపతను చిరునవ్వుతో ఇంక్‌బాటిల్ ఇస్తూ.

"అదేమిటి? మొన్నటివరకూ నాలుగు రూపాయలేగా?"

"బడ్జెట్ కద్సార్. ధర పెరిగింది"

"కాని బడ్జెట్‌లో "ఇంక్' ధర పెరగలేదుగా?"

"బడ్జెట్ ఎఫెక్ట్‌కి కొన్ని ధరలు పెరుగుతాయ్."

"ఎఫెక్ట్ అంటే?"

"డిఫెక్ట్ సార్– మీకు తెలీదా?"

తెలీదంటే బావుండదని ఇంటి కొచ్చేశాను. ఆ పక్కనే హెూటల్ అసామీ గట్టిగా అరుస్తున్నాడు "బడ్జెట్ గురించి పెరిగినాయివయ్యా రేట్లు– రేట్లు ఎందుకు పెరిగినాయంటే ఏమన్నమాట?"

అప్పుడే మా కాలనీ ముందు జనార్ధన్ రిక్షాదిగాడు. అతనితో పాటు ఓ మీసాల పెద్దమనిషి కూడా వచ్చాడు–

"నా దగ్గరున్న ఫాన్లు ఈయనకొంటానన్నారు గురూ! అందుకని తీసుకొచ్చాను–" అన్నాడు.

నేనూ, రంగారెడ్డి, యాదగిరి కలిసి జనార్ధన్ ఇంటికెళ్ళాం.

ఆ పెద్దమనిషి ఫాన్లన్నీ చూశాడు.

"ఎంతకమ్ముతావ్?" అనడిగాడు మీసాలు దువ్వుకుంటూ.

"నేను ఒకోటీ నాలుగొందలకు కొన్నానను. మీరు మూడొందల పాతికిస్తే చాలు" అన్నాడు జనార్దన్ దీనంగా.

మీసాల పెద్దమనిషి గట్టిగా నవ్వాడు. తన జేబులోనుంచి అయిడెంటిటీ కార్డ్ తీసిచూపిస్తూ "మిమ్మల్ని అరెస్ట్ చేస్తున్నాను–" అన్నాడు జనార్ధన్ భుజంతడుతూ.

అందరం అదిరిపడ్డాం! అతను మఫ్టీలో ఉన్న పోలీస్ ఇన్‌స్పెక్టర్.

"ఆ! అరెస్టెందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు జనార్ధన్.

"ఎందుకేమిటి? బడ్జెట్ ముందురోజు ప్రజావసర వస్తువులను ఎక్కువధరకు అమ్ముకోవడం కోసం స్టాక్ చేసినందుకు! దీనినే 'హోర్డింగ్' అంటారు" అన్నాడతను.

"కానీ.... కానీ...... ఇరవై ఫాన్లు కొన్నంత మాత్రాన హోర్డింగ్ ఎలా అవుతుంది?" అడిగాడు శాయిరామ్.

"అవునండీ! రేపు బడ్జెట్ అనగా పెట్రోల్ బంక్ వాళ్ళు పెట్రోల్ అమ్మకాలు ఆపేయటం, టీవి. రేడియో, ఇంకా ఇతర పెద్దపెద్ద కంపెనీలవాళ్ళు తమ స్టాక్‌ని రిలీజ్ చేయకపోవడం– ఇవన్నీ హోర్డింగ్ కాదా?" ఆవేశంగా అడిగాడు రంగారెడ్డి.

"వాళ్ళు కోటీశ్వరులు కాబట్టి వాళ్ళ జోలికెళ్ళటానికి మీకు దమ్ములేవు" అన్నాడు గోపాల్రావ్.

ఇన్‌స్పెక్టర్ మళ్ళీ మీసాలు దువ్వుకుంటూ చిరునవ్వు నవ్వాడు.

"ఆ చిన్నపిల్లల ప్రశ్నలన్నీ రేపు కోర్టులో జడ్జిగారి నడగండి!"

చివరకు అందరం ఇన్‌స్పెక్టర్‌ని బ్రతిమాలక తప్పలేదు.

"బాబ్బాబు! ఈ పాతికరూపాయలుంచుకోండి! మా వాడిని వదిలేయండి" అన్నాడు శాయిరామ్. ఇన్‌స్పెక్టర్ మళ్ళీ మీసాలు దువ్వుకున్నాడు.

"పాతికా? అహ్హహ్హ– వెధవరాంగ్ సైడ్ పార్కింగ్‌కేస్ పట్టుకుంటే చాలు. యాభయ్ దొరుకుతుంది. ఇంత పెద్దకేస్‌కి పాతికా?"

"పోనీ యాభయ్ తీసుకోండి."

"అహ్హహ్హ– సినిమాహాల్లో సిగరెట్ తాగినకేసుకే డెబ్బయ్ ఇస్తారు– ఇంతపెద్దకేసుకి యాభయ్యా?"

"బాబ్బాబు–పిల్లలు, ఫాన్లుగలవాడు. వాడిని దయచూడండి. ఓ వందతీసుకుని వదిలేయండి–"

"ఇదే కేసుకి నిన్నయితే వందేతీసుకునేవాడినయ్యా– ఇవాళ కూడా వందే ఇస్తానంటే ఎలా? నూటయాభై నవ్వండి."

"అదేమిటి? నిన్నటికీ ఇవాల్టికి యాభయ్ పెంచారా?"

"అవ్వునయ్యా– బడ్జెట్ వచ్చింది కదా, మామూళ్ళధరలుకూడా పెంచారు అంటే బడ్జెట్‌లో అనికాదు– బడ్జెట్ ఎఫెక్ట్ అంటారు దీనిని...."

"ఎఫెక్ట్ అంటే?..........." అని అడగబోయి "తెలుసులెండి డిఫెక్ట్" అన్నాను. నేను కేసుమాఫీ అయిపోయింది.

ఒక టేబుల్ ఫ్యాన్ ఫ్రీగా ఇచ్చినందుకు హోర్డింగ్ కేస్ విత్‌డ్రా చేసుకున్నాడు ఇన్‌స్పెక్టర్!

"బడ్జెట్‌లో మామూళ్ళకు కూడా రేట్లు ఫిక్స్ చేస్తారా?" అడిగాడు శాయిరామ్ అతను వెళ్ళాక.

"అయినా ఈ బడ్జెట్‌లో మామూళ్ళ ప్రసక్తేలేదే–" అన్నాడు జనార్ధన్ అనుమానంగా.

తీరా మా అందరి దగ్గరున్న వస్తువులన్నీ వదిలించుకున్నాక, అప్పుడు వాటి ధరలు విపరీతంగా పెరగటం గమనించి అందరం షాకయ్యాం.

ఆ విషయమే షాపువాళ్ళను నిలేశాం.

"బడ్జెట్‌లో పెంచలేదుగానీ– పెంచిన వస్తువులకూ వీటికీ లింక్ ఉంది సార్! అందుఏ పెరిగాయ్– వీటినే సైడ్ ఎఫెక్ట్ అంటారు" అన్నారు వాళ్ళు.

